నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తున్నాయని పేట్‌బషీరాబాద్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ సుచిత్ర, జీడిమెట్ల ఫీడర్ల పరిధిలోని వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, సుచిత్ర ప్రధాన రోడ్డు, సుచిత్ర అకాడమీ, బజరంగ్ హిల్స్, సర్వోత్తమ్ ఇండస్ట్రీ ఏరియా, జీడిమెట్ల గ్రామం, గ్రీన్‌పార్కు, భీమా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు...

◆ సెయింట్ ఆన్స్, వైష్ణవి ఫీడర్ల పరిధిలోని సెయింట్ ఆన్స్ స్కూల్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, ఎన్‌సీఎల్ సౌత్, వైష్ణవి ఎన్‌క్లేవ్, వేమనా బిల్డర్స్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, గంగా ఎన్‌క్లేవ్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ **కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..**

కొంపల్లి సబ్‌స్టేషన్ అపర్ణ ఫీడర్ పరిధిలోని అపర్ణ పామ్‌గ్రోవ్, వెంకటేశ్వర కాలనీ, దేవేందర్ కాలనీ, మికాసా స్టేర్లింగ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు...

◆ ధోలారీధని, జయభేరి, గార్డెన్ సొసైటీ ఫీడర్ల పరిధిలోని పోచమ్మగడ్డ, సాయికృప అపార్ట్‌మెంట్స్, ధోలారీధనీ రోడ్డు, కొంపల్లి స్మశాన గడ్డ, హార్లిక్స్ స్ట్రీట్, ఎస్ఎన్ఆర్, చంద్రారెడ్డి గార్డెన్ రోడ్డు, సంగం రెడ్డి కాంప్లెక్స్, బ్యాంక్‌కాలనీ, జయభేరి పార్క్ అపార్ట్‌మెంట్స్, శ్రీనివాస కాలనీ, ఉమామహేశ్వర కాలనీ, గార్డెన్ సొసైటీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కొంపల్లి ఏఈ తెలిపారు.

◆ **వికాస్, వొల్వా ఫీడర్ల పరిధిలో...**

నిజాంపేట్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వికాస్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విష్ణుకృపా డెవలపర్స్, ఎస్ఆర్ఐ కాలేజీ, కౌసల్య కాలనీ... వొల్వా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రేణుక ఎల్లమ్మ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కష్టపడే వారికే కాంగ్రెస్‌లో గుర్తింపు



నియామక పత్రాలను అందజేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పలు డివిజన్ల మహిళా కమిటీలను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు ఉత్తర్వులు జారీ చేశారు. వారికి కొలన్ హన్మంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, నిజాంపేట పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నేతలు శ్రీధర్‌రెడ్డి, నాగిరెడ్డి, ఇన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహిళా నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



ఏఈకి సమస్యలు వివరిస్తున్న మాజీ సర్పంచ్ కావలి గణేష్

దుండిగల్: స్థానికంగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ అన్నారు. దుండిగల్‌లోని 5వ వార్డులో డి.పోచంపల్లి విద్యుత్ ఏఈ సురేందర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఇళ్ల మధ్యలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ఇతర ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని, కొన్ని గృహాలపై నుంచి ఉన్న సర్వీస్ వైర్ల ఎత్తు పెంచాలని, విద్యుత్ హెచ్చుతగ్గులు వస్తున్నాయని అన్నారు. స్థానికులు ఫిర్యాదు చేస్తే సకాలంలో స్పందించాలని కావలి గణేష్ ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్, మంగలి యాదగిరి, మలిరెడ్డి నాగరాజు, మన్నాడి శ్రీకాంత్ ఉన్నారు.


ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య




మృతురాలు ప్రసన్న

సుభాష్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడి ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం ముత్యాల బస్తీకి చెందిన వెంకట్, ప్రసన్న (25)లు భార్యాభర్తలు. వీరికి ఆరాధ్య(05), లౌఖ్య(02) పిల్లలున్నారు. సూరారంలోని నారాయణ మల్లారెడ్డి ఆస్పత్రిలో ప్రసన్న మెడికల్ కో.ఆర్డినేటర్‌గా పనిచేస్తోంది. గురువారం ఉదయం 9గంటలకు తన భర్తను బైక్‌పై డ్రాప్ చేసి ఇంటికి వచ్చిన ప్రసన్న ఎవరూ లేని సమయంలో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పక్కింటి వాళ్లు తలుపులు తట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లి చూడగా ప్రసన్న ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆమెను సూరారం నారాయణ మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. కరోనా సమయంలో అప్పులు చేయడంతో వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో పట్టుబడిన కానిస్టేబుళ్లు



బాచుపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు



పట్టుబడిన సాగర్ పట్నాయక్, శ్రీనివాస్

నిజాంపేట్: జీడిపప్పు విక్రయాల ముసుగులో గంజాయి స్మగ్లింగ్ చేస్తూ పొరుగు రాష్ట్రానికి చెందిన ఇద్దరు పోలీసులు పట్టుబడిన ఘటన సంచలనం రేపుతోంది. హెడ్ కానిస్టేబుల్ సాగర్ పట్నాయక్, కానిస్టేబుల్ శ్రీనివాస్ ఇద్దరు జీడిపప్పు వ్యాపారం నిర్వహించగా నష్టాలు చవిచూశారు. ఈ నేపథ్యంలో గంజాయి స్మగ్లింగ్ చేసి పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించాలని ఆశతో అనారోగ్య కారణాలతో విధులకు సెలవు పెట్టారు. ఈ క్రమంలో మారుతి వ్యాన్‌లో గంజాయిని నగరానికి తీసుకొచ్చారు. నగర శివారులోని ప్రగతినగర్, మల్లంపేట్, బొల్లారం తదితర ప్రాంతాల్లో విక్రయాలు చేపట్టాలని ప్లాన్ చేశారు. వ్యాన్‌లో జీడిపప్పు పొట్లాలు కొన్ని ఉంచి ఆ ముసుగులో గంజాయిని విక్రయించే పథకం పన్నారు. అయితే దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ, బాచుపల్లి పోలీసులు గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ప్రగతినగర్‌కమాన్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వ్యాన్‌లో గంజాయిని తరలిస్తుండగా ఆపి తనిఖీలు చేయగా 11 ప్యాకెట్లలో ఉన్న 22 కేజీల గంజాయి పట్టుబడింది. వీరిని బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వ స్థలం.. పరుల పాలు!

పట్టించుకోని సంబంధిత అధికారులు



గాజులరామారం సర్వే నం.12లో వెలిసిన దుకాణాలు



సుభాష్‌నగర్: కబ్జా కోరల్లో చిక్కుకున్న కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని అన్ని సాక్ష్యాలతో 'సాక్షి'ప్రత్యేక కథనంతో వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ నేరుగా అక్కడికి వచ్చి సదరు స్థలం కబ్జా కాకుండా ఉండేందుకు అధికారులతో కలిసి పదుల సంఖ్యలను మొక్కలు నాటారు. అందులో బోర్డు ఏర్పాటు చేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కానీ కలెక్టర్ చెప్పిన మాటలు అప్పటి అధికారులు పెడచెవున పెట్టి ఫెన్సింగ్ వేయకుండా మొక్కల సంరక్షణపై గాలికి వదిలేసారు. ప్రస్తుతం సదరు స్థలం తనదేనంటూ అందులో టీ స్టాల్, పాన్ డబ్బా ఇతర చిన్నపాటి దుకాణాలను దర్జాగా ఏర్పాటు చేసి తమ దందాను కొనసాగిస్తున్నారు.

ప్రైవేట్ స్థలంగా పేర్కొంటూ దుకాణాల ఏర్పాటు..

◆ గాజులరామారం డివిజన్ లాల్ సాహెబ్ గూడ వెళ్లే ప్రధాన రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 12 ప్రభుత్వ స్థలంలో గత వారం రోజుల క్రితం కొంతమంది వ్యక్తులు సర్వే నంబర్ 445 ప్రైవేట్ స్థలంగా పేర్కొంటూ టీ స్టాల్, పాన్ షాప్, జ్యూస్, టిఫిన్ సెంటర్లను ఏర్పాటు చేసి తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు చూడకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ఇటీవల గాజులరామారం గ్రామస్తులు ప్రజా దర్బారులో ఫిర్యాదు చేశారు.

సాక్షాత్తు కలెక్టరే మొక్కలు నాటారు..

◆ సర్వే నంబర్ 12 ప్రభుత్వ స్థలం మీదుగా 40 ఫీట్ల మేర, ఓ వ్యక్తి పక్కనే ఉన్న ప్రైవేట్ వెంచర్‌కు అక్రమంగా రోడ్డు వేసుకున్నాడు. అంతేకాకుండా మిగిలిన రెండు ఎకరాల స్థలాన్ని సైతం కాజేసేందుకు ప్రయత్నిస్తుండగా 2018లో 'సాక్షి'ప్రచురితం చేసిన ప్రత్యేక కథనంతో అప్పటి కలెక్టర్ ఎంవీ రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి స్థలం కబ్జా కాకుండా మొక్కలు నాటారు. దీంతో కిందిస్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో పలుమార్లు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఎప్పటికప్పుడు 'సాక్షి'వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. తాజాగా సర్వే నంబర్ 12లో డబ్బాలు ఏర్పాటు చేసి తమ సొంత అవసరాలకు ఉపయోగించుకోవడం గమనార్హం.

ఏడీ సర్వే పెట్టాం...



సర్వే నంబర్ 12 స్థలం తమదంటూ వేరే వ్యక్తులు రావడంతో ఏడీ సర్వే పెట్టాం. సర్వే అనంతరం ప్రభుత్వ స్థలం అని తేలితే చర్యలు చేపడతాం. అంత వరకు సదరు స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు.

– అబ్దుల్ రహమాన్, కుత్బుల్లాపూర్ తహసీల్దార్

'ప్రధాని, రాష్ట్రపతిని కలవడం ఆనందంగా ఉంది'

ఆర్‌డీ పరేడ్‌లో పాల్గొన్న యశస్వినికి సత్కారం



విద్యార్థిని యశస్వినిని సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: తమ కళాశాల విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరడం తమకెంతో గర్వంగా ఉంటుందని ఎంఎల్ఆర్ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో జరిగిన పరేడ్‌లో ఎంఎల్ఆర్ఐటీ కళాశాలకు చెందిన విద్యార్థిని యశస్విని పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో లక్ష్మణ్‌రెడ్డి విద్యార్థిని యశస్వినిని సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ.. ఢిల్లీలో నెల రోజుల పాటు శిక్షణ పొంది పరేడ్‌లో పాల్గొనడంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములను కలిసే గొప్ప అవకాశం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ రావు, డీన్ రాధికాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు పడుతున్నాం.. కాస్త దయ చూపండి



ఉపకమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కుత్బుల్లాపూర్: సూరారం నుంచి కుత్బుల్లాపూర్‌కు విధులు నిమిత్తం తెల్లవారుజామున వచ్చేందుకు ఎటువంటి వాహన సదుపాయాలు లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని.. తమ సమస్యలను గుర్తించి సూరారంలోనే తమకు పారిశుద్ధ్య పనులు నిర్వహించే సౌకర్యం కల్పించాలని కార్మికులు శుక్రవారం కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహను కలిసి విన్నవించారు. కొంతకాలంగా కుత్బుల్లాపూర్ గ్రామంలో సుచిత్ర వరకు ప్రధాన రోడ్డుపై విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి విధుల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 5 గంటల నుంచి విధుల్లో ఉండాల్సిన వీరు వాహన సదుపాయాలు లేక కాలినడకగా సుదూరంగా ప్రయాణం చేసి వస్తు విధుల్లో పాల్గొనడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయంపై ఉపకమిషనర్‌కు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీసీ నరసింహ తప్పకుండా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

5న ప్రసాద విక్రయ కేంద్రానికి వేలం పాట

జగద్గిరిగుట్ట: శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 5వ తేదీన లడ్డూ, పులిహోర ప్రసాదముల విక్రయాల కోసం వేలం పాటను నిర్వహిస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఉంటాయన్నారు. లడ్డూ, పులిహోర, కొబ్బరికాయల విక్రయాల కోసం ఈనెల 5వ తేదీన మధ్యాహ్నం 12గంటలకు వేలం ఉంటుందన్నారు. వేలం పాటలో పాల్గొనాలనుకునే వారు రూ.5వేలు డిపాజిట్ చేయాలన్నారు. వేలం పాట దక్కని వారికి తిరిగి డబ్బులు చెల్లిస్తారని పేర్కొన్నారు.

గౌడ కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తా

చంద్రం దుర్గాగౌడ్



సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మెదక్ జిల్లా కొడిపల్లి గ్రామానికి చెందిన చంద్రం దుర్గాగౌడ్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. గురువారం ఉప్పల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్‌గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన దుర్గాగౌడ్ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా గౌడ కులస్తుల అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో తాను చేసిన కృషిని గుర్తించి తనకు పదవి కట్టబెట్టడం సంతోషంగా ఉందన్నారు. మున్ముందు సైతం ఇదే రీతిలో గౌడ కులస్తులు అన్ని రంగాల్లో అభ్యున్నతికి సాధించే దిశగా పని చేస్తానన్నారు.

జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: జాతీయ స్థాయిలో కులగణనను చేపట్టాలని ఓబీసీ హక్కుల పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కులగణన చేపడుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఓయూలో పీహెచ్‌డీ చేస్తున్న ఓబీసీ విద్యార్థులకు ప్రతి నెల ఫెలోషిప్‌లను రూ.10 వేల వరకు పెంచాలని అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐఓబీసీఎస్) జాతీయ అధ్యక్షులు జి.కిరణ్‌కుమార్ కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌తో పాటు ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లి సత్య, లెనిన్, దివ్యరాయ్, ఎస్ఎఫ్ఐ నేత రవినాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న కబడ్డీ పోటీలు



క్యాష్ రివార్డు అందజేస్తున్న కాసాని శిరీష

నిజాంపేట్: జాతీయ 49వ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్-2024 కబడ్డీ పోటీలు శుక్రవారం బాచుపల్లిలోని కాసాని కృష్ణ ముదిరాజ్ జె.ఎస్ గెహ్లాట్ కబడ్డీ అకాడమీలో 2వరోజు జోరుగా కొనసాగాయి. ఈ సందర్భంగా లీగ్ దశలో బాలికల విభాగంలో పంజాబ్ విదర్భల, చత్తీస్‌ఘడ్ జార్ఖండ్, రాజస్థాన్ ఒరిస్సా, పాండిచ్చేరి జమ్ముకాశ్మీర్, మధ్యప్రదేశ్, కేరళ, ఉత్తరాంచల్, తమిళనాడు జట్లు పోటీపడ్డాయి. బాలుర విభాగంలో హిమాచల్ ప్రదేశ్ - విదర్భ, పంజాబ్ - ఉత్తరాంచల్, ఢిల్లీ- ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ - మణిపూర్, తమిళనాడు - ఒరిస్సా, గోవా - గుజరాత్ జట్ల మధ్య పోటీలు జరిగాయి. లీగ్ దశలో విజేతలైన జట్లతో పాటు ఓడిన జట్లకు సైతం నగదు రివార్డులు అందజేశారు. ఈ పోటీలను తెలంగాణ కబడ్డీ అసోషియేషన్ కాసాని జ్ఞానేశ్వర్, ఏకేఎఫ్ఐ ఉపాధ్యక్షులు కాసాని వీరేష్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాసాని సుధాకర్, కాసాని శిరీష, కోఆప్షన్ సలీమ్, చంద్రగిరి సతీష్, దూసకంటి వెంకటేశ్, రాము చంద్రహాస్, లీగ్ దశలో విజేతలైన జట్లకు నగదు బహుమతులు ప్రదానం చేశారు.



కబడ్డీ ఆడుతున్న బాలికలు

నేడు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

శ్రీనగర్‌కాలనీ: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారి కోసం శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్‌లో ఐవీవై ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2024ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఔత్సాహిక విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకుంటే, ఉచితంగా రిజిస్ట్రేషన్ నిమిత్తం ఫోన్స్: 70557 27272, 91054 91054లలో సంప్రదించాలన్నారు.

కిరాణషాపులో చోరీ

రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

జీడిమెట్ల: కిరాణషాపులో దొంగలు పడి రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌నగర్‌కు చెందిన జ్యోతిరెడ్డి స్థానికంగా కిరాణదుకాణం నిర్వహిస్తోంది. ఎప్పటిలాగే గురువారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం వచ్చి చూడగా షట్టర్ తెరచి ఉంది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా కౌంటర్‌లో ఉన్న రూ.లక్ష కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో యువకుడు మృతి

జగద్గిరిగుట్ట: వెనుక నుంచి వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాదేవపురం సిఖ్‌బస్తీ ప్రాంతానికి చెందిన విక్రమ్‌సింగ్(22) తన బైక్‌పై శుక్రవారం సాయంత్రం ఎల్లమ్మబండ చౌరస్తా నుంచి సిఖ్ బస్తీ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో విక్రమ్ తలకు తీవ్ర గాయాలు కాగా కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మల్కాజిగిరి పార్లమెంటరీ సమావేశాన్ని

విజయవంతం చేయాలి

నేడు బహదూర్‌పల్లి మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో సమావేశం

కుత్బుల్లాపూర్: మల్కాజిగిరి పార్లమెంటరీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఈనెల 3వ తేదీన బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కాగా జంట సర్కిళ్లలోని డివిజన్లు, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సమావేశానికి పెద్దఎత్తున తరలి రావాలి

నిజాంపేట్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఈ నెల 3న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకులతో మాల్కాజిగిరి పార్లమెంటరీ సన్నాహక సమావేశం జరుగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మేయర్ నీలారెడ్డి అధ్యక్షతన నిజాంపేట్‌లోని కొలన్ రాఘవరెడ్డి గార్డెన్స్‌లో కార్యకర్తలు సమావేశమయ్యారు. శనివారం మధ్యాహ్నం 12గంటలకు ప్రగతినగర్‌లోని కేజీఆర్ కన్వెన్షన్‌లో సమావేశమై, అక్కడ నుంచి భోజనాంతరం బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌హాల్‌కు చేరుకోవాలని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంతో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో.ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి నుంచి కేటీఆర్ పోటీ చేయాలని తీర్మానం



తీర్మాన పత్రాన్ని చూపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ స్థానానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పోటీ చేయాలని ఆ పార్టీ శ్రేణులు తీర్మానించారు. కుత్బుల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ కూన గౌరీష్ పారిజాత ఆధ్వర్యంలో డివిజన్ నేతలు, కార్యకర్తలు తీర్మానంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ.. గడిచిన ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ సొంతం చేసుకుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేటీఆర్ పోటీ చేస్తే భారీ మెజార్టీతో గెలుపించుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా చేసిన తీర్మాన పత్రాన్ని పార్టీ అధిష్టానానికి పంపించారు.

సిల్వర్ ఓక్స్ విద్యార్థుల ఔదార్యం

రూ.24లక్షల విరాళం అందజేసిన వైనం

నిజాంపేట్: బాచుపల్లిలోని సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీని జమ చేసి మొత్తం రూ.24 లక్షల నగదును పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. శుక్రవారం పాఠశాల యాజమాన్యం వరంగల్ జిల్లా కల్లెడలోని రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్‌డీఎఫ్)కు రూ. 9 లక్షలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా నర్సారావుపేటలోని నైస్ అనాథ ఆశ్రమానికి రూ.5లక్షలను విరాళంగా అందజేశారు.



ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటా

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 19వ రోజు కృతజ్ఞత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంక్షేమ సంఘాలు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో మేడ్చల్ జిల్లాలో దేవేందర్‌గౌడ్ రూ.70వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారని గుర్తు చేశారు. దానిని అధిగమిస్తూ 85వేలకు పైగా మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో దాస్‌గౌడ్, రామ్మోహన్‌రావు, శ్రీనివాస్ రావు, ఆర్.సుబ్బయ్య, రమేష్, గోపాల్‌రెడ్డి, కుంట సిద్ధిరాములు, సంపత్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.